

సైబర్ నేరగాళ్ల వల

బ్యాంకు ప్రతినిధులమంటూ ఖాతాదారులకు ఫోన్లు, మెసేజ్‌లు



- డెబిట్ కార్డు అప్‌డేట్ చేయాలంటూ వివరాల సేకరణకు యత్నం
- నంబరు చెప్పిన క్షణాల్లోనే ఖాతాల్లో సొమ్ము లూటీ
- నగరంలో పెరుగుతున్న బాధితులు
- బ్యాంకు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దంటున్న పోలీసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'మీ ఏటీఎం కార్డు అప్‌డేట్ చేయాలి. లేదంటే బ్లాక్ అయిపోతుంది. వివరాల కోసం కింద పేర్కొన్న లింక్‌పై క్లిక్ చేయాలి'...అని పేర్కొంటూ నగరానికి చెందిన వందలాది మందికి రెండు రోజుల కిందట మెసేజ్‌లు వచ్చాయి.

'మీ డెబిట్ కార్డు గడువు ముగిసిపోతోంది. అప్‌డేట్ చేయాలి. కార్డుపై ఉన్న నంబరు చెప్పండి' అంటూ గుర్తుతెలియని నంబరు నుంచి ఇటీవల ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ వచ్చింది. ఎందుకైనా మంచిదని సహోద్యోగికి చెప్పడంతో అది మోసమని, స్పందించొద్దని చెప్పడంతో ఫోన్ కట్ చేసి తప్పించుకోగలిగారు.'

కొద్దిరోజులుగా నగరంలో చాలామందికి ఇలాంటి ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఒక తరహా మోసంపై ప్రజల్లో అవగాహన పెరిగి జాగ్రత్తపడుతుండడంతో సైబర్ నేరగాళ్లు మరో వ్యూహాన్ని అమలుచేస్తున్నారు. ఈ క్రమంలో పదేళ్ల కిందట ఎక్కువగా జరిగిన మోసాలను తాజాగా తెరపైకి తీసుకొస్తున్నారు.

బ్యాంకు ఖాతాదారులే లక్ష్యంగా...

దాదాపు ఇప్పుడు ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాను కలిగి ఉంటున్నారు. కొందరికి రెండు, మూడు బ్యాంకుల్లో ఖాతాలుంటున్నాయి. ఖాతాదారులకు ఏటీఎం/డెబిట్ కార్డులు జారీ అవుతున్నాయి. ఇలాంటి ఖాతాదారుల వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరించి, తమ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఖాతాదారుల్లో ఒక్కొక్కరికి ఫోన్ చేయడం లేదా మెసేజ్‌లు పంపించడం ద్వారా వల విసురుతున్నారు. ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ నమ్మబలికి మీ ఏటీఎం కార్డు బ్లాక్ అయిపోయిందని...లేదంటే త్వరలోనే బ్లాక్ అయిపోతుందని చెబుతున్నారు. కార్డు వివరాలు చెబితే వెంటనే అప్‌డేట్ చేస్తామనో... మెసేజ్‌లోని లింక్‌ను క్లిక్ చేస్తే ఆన్‌లైన్‌లోనే అప్‌డేట్ చేసుకోవచ్చుననో చెబుతున్నారు. నిజంగానే బ్యాంకు నుంచి ఫోన్ చేశారనే భావనతో ఖాతాదారులు అవతలివారు అడిగిన వివరాలు చెప్పేస్తున్నారు. అంతే ఫోన్ కట్ చేసేలోగానే ఖాతాలోని డబ్బు డ్రా అయినట్టు మెసేజ్‌లు వచ్చేస్తున్నాయి. ఆ మెసేజ్ వచ్చిన తర్వాత తమకు కాల్ వచ్చిన నంబర్‌కు చేస్తే 'మీరు డయల్ చేస్తున్న నంబరు సరిచూసుకోవాలంటూ' అనౌన్స్‌మెంట్ వస్తుంది.

నగరంలో ఈ తరహా మోసాలకు గురైన బాధితులు పలువురు పోలీసులను సంప్రతిస్తున్నా, సైబర్ నేరగాళ్లు నకిలీ ఐపీ నంబర్లు, ఫోన్ నంబర్లు, తప్పుడు ధ్రువపత్రాలతో తెరిచిన బ్యాంకు ఖాతాల ఆధారంగా మోసం చేస్తుండడంతో వారిని గుర్తించడం కష్టంగా మారుతోంది. కొన్ని కేసుల్లో ఐపీ నంబరు ఆధారంగా మోసం ఎక్కడి నుంచి ... మిగతా 6వ పేజీలో



ఓటర్లకు పంపిణీ చేసే చీర, కవరు

మహిళా ఓటర్లకు ఎర!

- 'తూర్పు'లో చీరలు పంపిణీ చేస్తున్న వైసీపీ ఇన్‌చార్జి
- వార్డు వలంటీర్లకు బాధ్యతలు

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), ఫిబ్రవరి 23: ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే తాయిలాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. విశాఖ తూర్పు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, ప్రస్తుత విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఈ ప్రక్రియలో ముందున్నారు. కొద్దిరోజుల కిందట నియోజకవర్గమంతా స్వీట్ ప్యాకెట్లు అందజేసిన ఎంవీవీ, తాజాగా చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గతంలో ఇంటికో స్వీట్ ప్యాకెట్ అందించగా, ఇప్పుడు ఇంట్లో ఎంతమంది మహిళా ఓటర్లు ఉంటే అన్ని చీరలను అందిస్తున్నారు. చీరలు ఉంచిన కవర్లపై సీఎం జగన్, ఎంపీ ఎంవీవీ బొమ్మలతో పాటు సిద్ధం నినాదం, ఎంపీ పేరు ముద్రించారు. కాగా వీటిని వార్డు వలంటీర్లతోనే ఇంటింటికీ పంపిణీ చేయిస్తున్నారు. ఇప్పటికే దాదాపు సగం వార్డుల్లో చీరల పంపిణీ పూర్తయిందని సమాచారం. మిగిలిన ప్రాంతాల్లోనూ జోరుగా సాగుతోంది. కాగా ఇది తూర్పు నియోజకవర్గానికే పరిమితమా, మాకు కూడా ఆయనే ఎంపీ కదా...మాకేవి చీరలు అని పక్క నియోజకవర్గాల మహిళలు వైసీపీ నాయకులను నిలదీస్తున్నట్టు తెలుస్తోంది.



ఏయూలో గంజాయ్!

గంజాయి సేవించిన ఏడుగురు విద్యార్థులను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

- వారి జేబుల్లో గంజాయి ప్యాకెట్లు లభ్యం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులకు అప్పగింత
- వర్సిటీ విద్యార్థులు కాదంటున్న అధికారులు
- బయటి కళాశాలలకు చెందిన వారంటూ వాదన
- గతంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ఏయూ సెక్యూరిటీ సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం గంజాయి వినియోగానికి అడ్డాగా మారుతోంది. గతంలో గంజాయి విక్రయిస్తూ సెక్యూరిటీ సిబ్బంది పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. సదరు సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవడంతో అప్పటికి సద్దుమణిగింది. కానీ ఇప్పటికీ వర్సిటీలో గంజాయి విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్టు సమాచారం.



తాజాగా గురువారం సాయంత్రం గంజాయి ప్యాకెట్లతో ఏడుగురు విద్యార్థులు వర్సిటీలోని ఓ హాస్టల్‌లో పట్టుబడడంతో కలకలం రేగింది. వర్సిటీ అధికారుల కథనం ప్రకారం...ఓ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల వద్దకు బయట నుంచి ఏడుగురు విద్యార్థులు వచ్చారు. వారు తిరిగి వెళుతున్న సమయంలో వ్యవహారశైలి భిన్నంగా ఉండడంతో సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేశారు. ఇద్దరు విద్యార్థుల జేబుల్లో గంజాయి ప్యాకెట్లు లభించడంతో వారిని రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో వారిని పోలీసులకు అప్పగించి, ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ బయటి నుంచి ఏడుగురు విద్యార్థులు క్యాంపస్‌లోని తమ మిత్రుల వద్దకు వచ్చారన్నారు. వీరిలో ప్రిజంతోపాటు మరో కళాశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని, వీరు హాస్టల్ నుంచి వెళ్లే సమయంలో సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా వారిలో ఏయూ విద్యార్థులు ఎవరూ లేరని ఆయన వెల్లడించారు.

ఇద్దరు ఏయూ విద్యార్థులే...

గంజాయితో దొరికిన విద్యార్థులంతా బయట కళాశాలలకు చెందినవారని ఏయూ అధికారులు చెబుతుండగా... పోలీసులు మాత్రం ఇద్దరు వర్సిటీ విద్యార్థులు ఉన్నట్టు తేల్చారు. ఆ ఇద్దరు ఏయూలోనే ఎమ్మెస్సీ చదువుతూ శ్రీకృష్ణదేవరాయలు వసతిగృహంలో ఉంటున్నారు. వారి వద్దకే బయట నుంచి మరో ఐదుగురు విద్యార్థులు వచ్చారు. బయట నుంచి వచ్చిన విద్యార్థులు గంజాయి తెచ్చారా? లేక ఏయూలో ఉన్న విద్యార్థుల వద్దే గంజాయి ఉందా?...అన్న విషయం తేలాల్సి ఉంది. వర్సిటీ అధికారులు మాత్రం ఏడుగురూ బయట నుంచి వచ్చిన విద్యార్థులు అని చెబుతుండడం గమనార్హం. ఏయూ విద్యార్థులు లేరని కప్పి పుచ్చుకోవడం వల్ల ప్రయోజనం లేదని, వర్సిటీలోకి గంజాయి ఎలా వస్తుందన్న దానిపై దృష్టి సారించాల్సిన అవసరముందని పలువురు పేర్కొంటున్నారు.

గుట్టుగా విక్రయాలు

వర్సిటీలో పలువురు విద్యార్థులు గంజాయి వినియోగానికి అలవాటుపడ్డారని సమాచారం. క్యాంపస్‌లోని హాస్టల్‌కు బయటి నుంచి ఏడుగురు విద్యార్థులు వచ్చి గంజాయి సేవించి వెళుతున్నారంటే.. ఇక్కడి విద్యార్థులకు అలవాటు లేకుండానే ఇదంతా జరిగిందని నమ్మలేని పరిస్థితి. క్యాంపస్‌లోని విద్యార్థుల వ్యవహారాన్ని వర్సిటీ అధికారులు బయటపెట్టడం లేదు... కానీ అంతర్గతంగా వారిపైనా విచారణ సాగుతోందని చెబుతున్నారు. ఏయూ చుట్టుపక్కల అనేక దుకాణాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయంటున్నారు. విద్యార్థులకు గంజాయిని సరఫరా చేయడానికి కొన్ని బ్యాచ్‌లు ఉన్నాయని, ఈ విషయంలో సెక్యూరిటీ సిబ్బంది కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుంటారని చెబుతున్నారు. అందుకు వారికి కొంతమొత్తం అందుతుందంటున్నారు. గంజాయి విక్రయాలపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని క్యాంపస్‌లోని ... మిగతా 6వ పేజీలో



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో సీపీ రవిశంకర్ అయ్యనార్ వున్నారు



1న ప్రధాని రాక?

- ఏయూలో బహిరంగ సభ
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23: వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోదీ మార్చి ఒకటో తేదీన నగరానికి రానున్నట్టు సమాచారం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బహిరంగ సభలో పాల్గొంటారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులతో కలిసి ఏయూ మైదానాన్ని పరిశీలించారు. ప్రధాని పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బలమైన బారికేడ్లు నిర్మించాలని, నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఈడీలు రాజీవ్ గోయల్, అభిషేక్ త్రివేది, సురేంద్రగుప్త, సీజీఎం (హెచ్ఆర్) కిరణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐద్వా ర్యాలీ



ఐద్వా అఖిల భారత సమావేశాలు శుక్రవారం నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు. - వార్త మెయిన్ ఎడిషన్‌లో..

ఆశావహుల్లో ఉత్కంఠ



నేడు టీడీపీ, జనసేన అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసే అవకాశం

- సిట్టింగ్ ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబుల పేర్లు తొలి జాబితాలో ఉండే అవకాశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితా శనివారం విడుదల చేయనున్నట్టు తెలిసింది. తొలి జాబితాపై ఇప్పటికే సీనియర్లకు రెండు పార్టీల పెద్దల నుంచి సమాచారం అందిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ కొలకొంది.

జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 2019 ఎన్నికల్లో విశాఖ తూర్పు, దక్షిణ, ఉత్తరం, పశ్చిమ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. వీరిలో దక్షిణ నియోజకవర్గం నుంచి ఎన్నికైన వాసుపల్లి గణేష్‌కుమార్ వైసీపీలో చేరగా, 'నార్త్' నుంచి ఎన్నికైన గంటా శ్రీనివాసరావు ఈసారి భీమిలి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అయితే ఆయన్ను అధిష్ఠానం విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాల్సిందిగా సూచించింది. పది రోజుల క్రితం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఈ సూచన చేశారని, దానిపై మిత్రులు, సహచరులు, పార్టీ నాయకులతో చర్చిస్తున్నానని, ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన గురువారం విలేకరులకు వెల్లడించారు. తనకైతే విశాఖ జిల్లా నుంచే పోటీ చేయాలని ఉందన్నారు. గంటా ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది ఇంకా స్పష్టత రాలేదు. కాగా విశాఖ తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబుకు పోటీ లేనందున ఇరువురి పేర్లు తొలి జాబితాలో ప్రకటించే అవకాశం ఉంది. ఇంకా బండారు సత్యనారాయణమూర్తి (పెందుర్తి), గండి బాబ్జీ (విశాఖ దక్షిణ) పల్లా శ్రీనివాసరావు (గాజువాక), కోరాడ రాజబాబు (భీమిలి) ప్రస్తుతం నియోజకవర్గాల ఇన్‌చార్జులుగా ఉన్నారు. ఈ నాలుగింటికి అభ్యర్థుల ప్రకటనపై సందిగ్ధం నెలకొంది. పొత్తులో జనసేనకు కేటాయించే సీట్లపై రకరకాల ప్రచారం జరుగుతున్నా ఇప్పటివరకూ స్పష్టత లేదు. విశాఖలో జిల్లాలో ఒకటి లేదంటే రెండు సీట్లు జనసేనకు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. మరోవైపు బీజేపీతో కూడా పొత్తు దాదాపు ఖాయమైంది. ఆ రెండు పార్టీలకు ఇచ్చే సీట్లపై స్పష్టత వచ్చిన తరువాతే మిగిలిన నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో కనీసం రెండు సీట్లు ఇవ్వాలని జనసేన నాయకులు కోరుతున్నారు. అలాగే పొత్తు ఖరారైతే భారతీయ జనతా పార్టీకి 'నార్త్' సీటు ఇచ్చే అవకాశం ఉంది. మొత్తం ఏడు సీట్లలో శనివారం రెండు పార్టీలకు సంబంధించి ఎంతమంది అభ్యర్థులను ప్రకటిస్తారన్నది ఉత్కంఠ రేపుతోంది.

జనసేనలో పోటీ

రాబోయే ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసేందుకు చాలామంది పోటీ పడుతున్నారు. విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షునిగా పంచకర్ల రమేశ్‌బాబు... మిగతా 6వ పేజీలో

స్టార్ హోటళ్లలో గుట్టుగా పేకాట

- అలాంటి హోటళ్ల వైపు చూసేందుకు సాహసించని పోలీసులు
- ఫిర్యాదులు అందితేనే దాడులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో పేకాట జోరుగా సాగుతోంది. కొంతమంది సంపన్నులు ఏకంగా స్టార్ హోటళ్లనే డెన్‌లుగా మార్చుకుంటున్నారు. హోటళ్లలో పేకాట జరుగుతున్నట్టు సమాచారం ఉన్నప్పటికీ తామెక్కడ ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందోననే భయంతో అటు వైపు కన్నెత్తి చూడడానికి పోలీసులు సాహసించడం లేదు. ఇటీవల ఫిర్యాదు రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఒక హోటల్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు.

నగరంలో కొంతమందికి పేకాట వ్యసనంగా మారింది. ఇందులో వ్యాపారులు, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారు అధికంగా ఉంటున్నారు. వీరు పేకాట కోసం హోటళ్లను ఎంచుకుంటున్నారు. కొన్నాళ్ల కిందట బీచ్‌రోడ్డులోని ఒక స్టార్ హోటల్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నారని, వారిలో పోలీసులు కూడా ఉన్నారని నేరుగా అప్పటి సీపీకి ఫిర్యాదు అందింది. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ హోటల్‌పై దాడి చేయగా కొంతమంది పట్టుబడ్డారు. వారిలో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కూడా ఉన్నప్పటికీ, శాఖాపరంగా తన పలుకుబడిని ఉపయోగించుకుని ఆయన తప్పించుకున్నట్టు ప్రచారం జరిగింది. పోలీసులు కూడా శాఖ పరువు పోతుందనే భావనతో సదరు సీఐను తప్పించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా నగరంలోని మరో హోటల్‌లో పేకాట జరుగుతోందని సీపీకి కొంతమంది ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించగా, తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.2.65 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పేరొందిన హోటళ్లలో గుట్టుగా పేకాట సాగుతోందనడానికి తాజా ఉదంతమే నిదర్శనం. పోలీసులు ఇప్పటికైనా స్టార్ హోటళ్లలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలి.

ఇంటర్ బోర్డు వివక్ష

- జంబ్లింగ్ పేరుతో నిబంధనలకు తూట్లు
- అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కాలేజీలు...
- మూడు కళాశాలల విద్యార్థులకు స్థానికంగానే పరీక్షలు
- అచ్యుత కళాశాల విద్యార్థులకు మాత్రం 20 నుంచి 28 కి.మీ. దూరంలోని కేంద్రాలు కేటాయింపు
- దివ్యాంగ విద్యార్థులపై జాలి చూపని అధికారులు



ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న దివ్యాంగ విద్యార్థులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 23: ఇంటర్ పరీక్షలకు కేంద్రాల కేటాయింపులో బోర్డు అధికారులు వివక్ష చూపిస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కళాశాలలు ఉండగా... మూడు కళాశాలల విద్యార్థులకు వీటిల్లో కాలేజీని పరీక్షా కేంద్రంగా కేటాయించారు. కానీ మరో కళాశాల విద్యార్థులకు మాత్రం 20 నుంచి 28 కిలోమీటర్ల దూరంలో కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. వీరిలో దివ్యాంగ విద్యార్థులపై కూడా ఉన్నారు. వివరాల్లోకి వెళితే...

అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మాస్ కాపీయింగ్, ఇతర అక్రమాలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో బోర్డు అధికారులు జంబ్లింగ్ ... మిగతా 6వ పేజీలో

ఆ 10 మందీ వైసీపీ సానుభూతిపరులే

- టీడీపీ నాయకుల ఆరోపణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపునకు తప్పుడు దరఖాస్తులు అందజేసిన వ్యవహారంలో వైసీపీ సానుభూతిపరుల పాత్ర ఉందని తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు. కేసు నమోదైన పది మందిలో పలువురు అధికార పార్టీకి చెందినవారేనని చెబుతున్నారు. బూత్-183 పరిధిలో ఉంటున్న నమ్మి లీలానాగవల్లి వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ఉన్నారని, బత్తుల రంగనాయకమ్మ (బూత్ నంబరు 6), గొల్లపల్లి కావ్య (బూత్ నంబరు 33)లు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆడారి ఆనంద కుమార్ కార్యాలయంలో పనిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇంకా రొంగలి సుధ (బూత్ నంబర్ 32) వలంటీర్ భార్య, గీశాల నూకరాజు (బూత్ నంబరు 204) వైసీపీ వార్డు స్థాయి నాయకుడు, నుండి సుజాత (బూత్ నంబరు 162) క్రాంతినగర్ ఏరియా సచివాలయ వైసీపీ కన్వీనర్‌గా ఉన్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. వీరిలో ఇద్దరు, ముగ్గురు బూత్ లెవెల్ ఏజెంట్లుగా పనిచేశారని పేర్కొన్నారు.

కాంట్రాక్టు నర్సుల సర్వీసు క్రమబద్ధీకరించాలి



ఎంపీ సత్యనారాయణకు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట, ఫిబ్రవరి 23: కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల స్ట్రగుల్ కమిటీ (కేజీహెచ్) సభ్యులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శుక్రవారం విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సభ్యురాలు షేక్ షహీరీ బేగం మాట్లాడుతూ, ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తున్న జాబితాలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. కొవిడ్ సమయంలో తాము ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు సేవలు అందించామని గుర్తు చేశారు. ఈస్థితిలో ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేయ రాదని కోరారు. తమను రెగ్యులర్ చేసే వరకు వంద శాతం గ్రాస్ శాలరీ అందించాలని కోరారు.

'రెల్లి సామాజిక వర్గానికి 'దక్షిణ' టికెట్ ఇవ్వాలి'

మహారాణిపేట, ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ రెల్లి సామాజిక వర్గానికి కేటాయించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కస్తూరి వెంకటరావు కోరారు, శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ మేరకు ఆయన దరఖాస్తును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో సేవలందిస్తున్నానన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయురాలు



కుటుంబ సభ్యులతో ఫాతిమ

దొండపర్తి, ఫిబ్రవరి 23: టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న ఫాతిమని శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు..ఆమె సోదరుడు రషీద్ అలీగాజీకి అప్పగించినట్లు గృహం మేనేజర్ కె. జ్యోతిర్మయి తెలిపారు. ఫాతిమ తన భర్త వివాహేతర సంబంధాన్ని చూసి తట్టుకోలేక మానసిక ఒత్తిడితో 9 నెలల క్రితం పశ్చిమ బెంగాల్‌లోని మజిల్ పుర తాలుకాలోని బిల్వార గ్రామం నుంచి విశాఖకు వచ్చేసింది. కంచరపాలెం పోలీసుల సహకారంతో గత అక్టోబరులో ఫాతిమను రెస్క్యూ చేసి వైద్యం అందించినట్లు చెప్పారు. కోలుకోవడంతో ఆమెను సోదరుడు రషీద్‌కు అప్పగించామన్నారు.

వైశాఖీ పార్కు అధ్యక్షునిగా వరప్రసాద్



వరప్రసాద్

మురళీనగర్, ఫిబ్రవరి 23 ; గ్రేటర్ 50వవార్డు లోని వైశాఖీ స్పోర్ట్స్ పార్కు కమిటీ పాలకవర్గ అధ్యక్షునిగా సనపల.వరప్రసాద్ ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. రెండేళ్ల పదవీ కాలానికి జరిగిన ఎన్నికలో కాలనీ వాసుల అత్యధిక శాతం ఆయనకు మద్దతిచ్చారు.ఈ మేరకు ఎన్నికల అధికారులు వర వరప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రమందించారు. ఆయనతో పాటు మరో 9 మంది సభ్యులు పాలకవర్గంలో కొనసాగుతారు.

పేదలకు చీరలు పంపిణీ

మహారాణిపేట, ఫిబ్రవరి 23: దక్షిణ నియోజకవర్గ పరిధి 29 వ వార్డులోని ఊటగెడ్డ, సూర్యనగర్ తదితతదితర ప్రాంతాల్లో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ ఇంటింటికి వెళ్లి చీరలు పంపిణీ చేశారు. అల్పదాయ వర్గాల అభ్యున్నతి కోసం పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ,కండిపల్లి సతీశ్, చోల్లంగి శేఖర్. ఓన్మి కిశోర్, పల్లా రాధాలక్ష్మి పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపుతోనే ప్రజలకు సుఖ శాంతులు'



42వ వార్డులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

దొండపర్తి, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలంటే టీడీపీని గెలిపించాలని విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ అన్నారు. గ్రేటర్ 42వ వార్డులో శుక్రవారం శంఖారావం కార్యక్రమం జరిగింది. ఈ మేరకు నాయకులు వార్డులోని ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నం వెంకటరమణారావు, ముక్కి రామకృష్ణ, కాపు కార్పొరేషన్ మాజీ కార్యదర్శి ఎంఎల్ఎన్ రావు, వార్డు మహిళా అధ్యక్షురాలు కుప్పిలి కుంతీదేవి, సీత, సీహెచ్ రమణమ్మ, ఎం. మాధవి, కుమారి, వేణమ్మ పాల్గొన్నారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఆరిలోవ, ఫిబ్రవరి 23: విమ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సెకండరీ లెవెల్ కెమికల్, బయో లాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌కు సంబంధించిన స్థలాన్ని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ సీనియర్ రీజనల్ డైరెక్టర్ ఎం. అనురాధ ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలోని 12వ బ్లాక్‌లో ఉన్న స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్ బ్లడ్ బ్యాంకు, క్యాజువాలిటీ వార్డులను పరిశీలించారు. కమిటీ సభ్యులకు విమ్స్ డైరెక్టర్ రాంబాబు ఆసుపత్రిలోఉన్న మౌలిక సదుపాయాల గురించి వివరించారు. త్వరలోనే ఆసుపత్రిలో సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని బృంద సభ్యులు చెప్పారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం తిరోగమనం

▸ దక్షిణ ఇన్‌చార్జి గండిబాబ్జీ



కరపత్రాలు అందిస్తున్న గండి బాబ్జీ, టీడీపీ నాయకులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 23: వైసీపీ గత నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల అభివృద్ధిలో వెనక్కి వెళ్లిపోయిందని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం గ్రేటర్ 37వ వార్డులో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడం చాలా అవసరమన్నారు. చం ద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉందని పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలతోపాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలుంటాయన్నారు ప్రధానంగా మహిళల కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో తీవ్ర నష్టం జరిగిందన్నారు. తిరిగి రాష్ట్రం కోలుకోవాలంటే ప్రజలంతా కలసికట్టుగా టీడీపీని రానున్న ఈసారి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వార్డు స్థాయి నాయకులు, మహిళలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు..

ప్రజల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం

▸ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23 : దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణుకుమార్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పలు సంస్కరణలతో పాలన సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలంతా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అక్కయ్యపాలెం మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, కొప్పిశెట్టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23 : గ్రేటర్ 45వవార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో ఏఎస్ఆర్‌నగర్‌లో టిడ్కో ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం లబ్ధిదారులకు ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కేకే రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఏపీడీ పద్మావతి, నాయకులు హరి పట్నాయక్, ఆదిలక్ష్మి, నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనకు మద్దతు ఇవ్వండి

▸ జనసేన నాయకురాలు ఉషాకిరణ్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉషాకిరణ్

కంచరపాలెం, ఫిబ్రవరి 23: ఛిన్నాభిన్నమైన రాష్ట్ర భవిష్యత్ మళ్లీ ఒక గాడిలో పడాలంటే టీడీపీ జనసేన అధికారం చేపట్టాలని ఉత్తర నియోజకవర్గ జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. జీవీఎంసీ 47వ వార్డు పరిధి కప్పరాడ, పెదకొత్తూరు గ్రామాల్లో శుక్రవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు వైసీపీ అధికారం చేపట్టాక యువతకి ఉపాధి కరువైందన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టారన్నారు.గంజాయి మత్తులో యువత భవిష్యత్తు నాశనమవుతుందన్నారు.గంజాయిని నిరోధించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎం.రాజారావు, ఎం. మోసెస్, సురేశ్, ఫణి, రఫీ జాన్సన్, అప్పలకొండ, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

▸ డీఈవో చంద్రకళ



విజేతలకు కప్ అందచేస్తున్న డీఈఓ చంద్రకళ

సీతమ్మధార, ఫిబ్రవరి 23: విద్యార్థులు చదువుతోపాటు ఉపాధి కల్పనకు గల అవకాశాలను అన్వేషిస్తూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. గురుద్వారా మందిరం సమీపంలోని వసంతబాల విద్యోదయ పాఠశాలలో ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్సెట్ డెవలప్‌మెంట్ (ఈఎండీపీ) జిల్లాస్థాయి ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. 11 పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా డీఈవో, డి ప్యూటీ డీఈఓ గౌరిశంకర్, ఏపీసీ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, ఎంఈవో ఈ నమూనాలను పరిశీలించి విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సైన్స్ ప్రదర్శనలో జ్ఞాన నికేతన్ ఎయిడెడ్ స్కూల్‌కి ప్రథమ స్థానం, రైల్వే న్యూకాలనీ జీహెచ్ఎస్ పాఠశాలకు ద్వితీయ స్థానానికి ఎంపికైంది. ఈ రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపికచేసినట్టు అధికారురులు తెలిపారు. జ్యూరీ కమిటీ సభ్యులుగా టీ రామ్‌కుమార్, లక్ష్మి వ్యవహరించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీపీ స్టేట్ హెడ్ సతీష్, జోనల్ మేనేజర్ అగ్నిహోత్ర శర్మ, జిల్లా మేనేజర్ నరేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతకు ఎర్రన్నాయుడు పోరాటం స్ఫూర్తి

▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కింజరాపు ఎర్రన్నాయుడు చిత్రపటానికి టీడీపీ నాయకులు

మహారాణిపేట, ఫిబ్రవరి 23: దివంగత టీడీపీ నేత కింజరాపు ఎర్రన్నాయుడు పోరాట పటిమను యువ నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు .శుక్రవారం పార్టీ కార్యలయంలో ఎర్రన్నాయుడు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్లమెంట్‌లో ఉత్తరాంధ్ర సమస్యలను ఎ ర్రన్నాయుడు బలంగా వినిపించేవారన్నారు. కేం ద్ర మం త్రిగా ఆయన ఎన్నో సేవలందించారన్నారు. ఆయన ఆశయాలను పార్టీ నాయకులంతా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కో రాడ రాజబాబు, పాశర్లప్రసాద్ , పైలా ముత్యాల నాయుడు , లొడగల కృష్ణ, విల్లూరి చక్రవర్తి పాల్గొన్నారు.

జేసీఎల్‌ను సస్పెండ్ చేయాలి

▸ నెల్లిమర్ల మిమ్స్ కార్మికుల నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ నేత సూర్యనారాయణ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23: విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఆ యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ (జేసీఎల్) గణేశ్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయూ ఆ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిలోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 23 రోజులుగా మిమ్స్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కార్మిక శాఖాధికారుల చుట్టూ తిరుగుతున్నా వారు పట్టించుకోవడంలేదన్నారు. విశాఖ జేసీఎల్ వద్ద చర్చలు పేరిట యాజమాన్యం, వారికి అనుకూలంగా ఉన్న నలుగురు కార్మికులను అధి కారులు ఆహ్వానించారన్నారు. ఈస్థితిలో ఉద్యోగులంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడుతున్నారని చెప్పారు. యాజమాన్యం ఉద్యోగుల పక్షాన ఆలోచించి పరిష్కారం చేయాలని హితవు పలికారు. యాజమాన్యం ఇప్పటి వర కు ఉద్యోగులకు జనవరి నెల జీతం చెల్లించలేదన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించకుంటే కుటుం బ సభ్యులతో కలిసి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేశ్, ఉద్యో గులు మిరపనారాయణ, కర్రోతు కామునాయుడు, మహంతి నాగభూషణం, మధు, మూర్తి, రాంబాబు, గౌరి, వరలక్ష్మి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ జట్టీ వద్దకు సేఫ్టీ బోట్లు



బీచ్‌లో సందర్శకుల భద్రత కోసం సిద్ధం చేసిన బోట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైఎంసీఏ ఎదురుగా బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జి వద్ద సందర్శకుల భద్రత కోసం సేఫ్టీ బోట్లు తీసుకువచ్చారు. ఫ్లోటింగ్ బ్రిడ్జి నుంచి సముద్ర అలల వరకు వెళ్లే సమయంలో సందర్శకులు ప్రమాదంలో పడినా తక్షణమే వారిని రక్షించడానికి ఈ బోట్లు సిద్ధంచేశారు.

ఏయూలో గంజాయ్!

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులే పేర్కొంటున్నారు.

కఠినంగా వ్యవహరిస్తేనే...

బయటి విద్యార్థులు క్యాంపస్‌లోకి గంజాయి తీసుకుని వచ్చారంటే సెక్యూరిటీ ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మధ్యాహ్నం వేళ క్యాంపస్‌తో సంబంధం లేని వారు బ్యాగులతో సహా వర్సిటీలోకి వెళుతున్నా సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్యాంపస్‌లోకి అడుగుపెట్టాలంటే ఐడీ కార్డులు తప్పనిసరి చేస్తూ గతంలో అధికారులు ఆదేశాలు జారీచేశారు. వాటిని సక్రమంగా పాటించకపోవడం వల్లే తాజా ఘటన చోటుచేసుకుందంటున్నారు. ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్న విద్యార్థులు ఇంకెంతమంది క్యాంపస్‌కు వచ్చి, వెళుతున్నారోననే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో మరింత కఠినంగా ఉంటామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇకపై వర్సిటీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేలా ఆదేశాలు జారీచేశామని, వసతి గృహాలకు బయటివారు రాకుండా చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ స్టీఫెన్ పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల వల

... 5వ పేజీ తరువాయి

చేశారో గుర్తించగలుతున్నారు. అయితే జార్ఖండ్, ఢిల్లీ తదితర ప్రాంతాలతోపాటు నైజీరియా వంటి దేశాల నుంచి మోసానికి పాల్పడినట్టు తేలడంతో వారిని పట్టుకోవడం సాధ్యం కావడం లేదు.

బ్యాంకు అధికారులు వివరాలు అడగరు

బ్యాంకు అధికారుల వద్ద ఖాతాదారుల వివరాలన్నీ అందుబాటులో ఉంటాయి. వివరాలను అడగాల్సిన అవసరం వారికి ఉండదు. సైబర్‌క్రైమ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా బాధితులు పెరుగుతుండడం విచారకరం. బ్యాంకుల నుంచి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే కట్ చేసేయాలి. మెసేజ్‌లకు స్పందించకుండా డిలీట్ చేసేయాలి. సైబర్ నేరగాళ్లు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నెట్ కాల్స్ ద్వారా మాట్లాడి మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఆ నంబరుకు తిరిగి ఫోన్ చేసినా కలవదు. బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డుల వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దు.

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

ఆశావహుల్లో ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి సీటు ఆశిస్తున్నారు. ఆయన గతంలో పెందుర్తి, ఎలమంచిలి నుంచి రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక విశాఖ సిటీ అధ్యక్షునిగా ఉన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ గతంలో తూర్పు నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆయన మరోసారి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు. అలాగే పసుపులేటి ఉషాకిరణ్ (ఉత్తరం), పంచకర్ల సందీప్ (భీమిలి) వంటివారు నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్నారు.

ఇంటర్ బోర్డు వివక్ష

... 5వ పేజీ తరువాయి

విధానాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలలో కాకుండా చుట్టుపక్కల వున్న వేరే కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయిస్తున్నారు. ఈ మేరకు 15 కిలోమీటర్ల పరిధిలో వున్న కాలేజీలను మాత్రమే పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేయాలి. కాగా అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కళాశాలలు ఉండగా, మూడు కళాశాలల విద్యార్థులకు వీటిల్లో ఒక కాలేజీని పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. అయితే అచ్యుత జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఇక్కడ పరీక్షా కేంద్రం కేటాయించలేదు. జంబ్లింగ్ పేరుతో 20 కిలోమీటర్ల దూరంలో వున్న ఎలమంచిలి దరి కొక్కిరాపల్లిలో, 28 కిలోమీటర్ల దూరంలో వున్న కశింకోట మండలం తాళ్లపాలెంలోని కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. అచ్యుత కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో దివ్యాంగ (అంధ, బధిర, మూగ, శరీర వైకల్యం కలిగిన) విద్యార్థులు ఐదుగురు ఉన్నారు. వీరికి జంబ్లింగ్ వర్తించదన్న నిబంధనను అధికారులు బేఖాతరు చేశారు. కాగా 15 కిలోమీటర్లలోపు అనే నిబంధనను ఇంటర్ బోర్డు అధికారులు తుంగలో తొక్కడమే కాకుండా దివ్యాంగ విద్యార్థులన్న కనికరం కూడా లేకుండా సుదూరంలో వున్న కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. దీనిపై కళాశాల నిర్వాహకులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్, ఫిబ్రవరి 23; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఈనెల 24వతేదీ శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి తెలిపారు. ఆల్ఫా మెడికల్ సెర్వీసెస్ వైద్య బృందం సాయంతో దీనిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా గుండె వ్యాధి చికిత్సలు, ఈసీజీ పరీక్షలు, ఈఎన్‌టీ రుగ్మతలకు చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

మహారాణిపేట, ఫిబ్రవరి 23: గ్రేటర్ 29 వ వార్డు చందక వీధిలో ఎన్టీఆర్ సేవా సమితీ ట్రస్టు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు గండి వంశీదీప్ మహిళలకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల శిబిరంలో వైద్యుల సూచనల మేరకు ఎంపిక చేసిన వారికి అందించారు. మధు, సత్యనారాయణ, గణేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు

కొండకర్ల రిసార్ట్‌లో అడ్డగోలు వ్యవహారాలు

▸ పార్టీ పేరుతో మద్యం సేవించిన యువకులు
▸ యువతులతో కలిసి రెయిన్ డ్యాన్స్
▸ శ్రుతి మించి.. నగ్నంగా డ్యాన్స్ చేయాలని అమ్మాయిలపై ఒత్తిడి
▸ డయల్ 100కు ఫోన్ చేసిన ఓ యువతి
▸ పోలీసులు వెళ్లినప్పటికే పలువురు పరారీ
▸ కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేసిన పోలీసులు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని కొండకర్ల ఆవ సమీపంలో అధికార పార్టీ నాయకుడికి చెందిన ఒక రిస్టార్‌లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కొంత మంది యువతీ యువకులు ఇక్కడ పార్టీ చేసుకున్నారు. మద్యం సేవించి వున్న యువకులు, నగ్నంగా డ్యాన్స్ చేయాలని యువతులను బలవంతంగా చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు రిసార్ట్ వద్దకు వెళ్లారు. అధికార పార్టీ నేతకు చెందిన రిసార్ట్ కావడంతో పార్టీ చేసుకున్న యువతీ యువకులను హెచ్చరించి వదిలేశారు. దీనికి సంబంధించి విశ్వసనీయ వర్గాలు సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ సమీపంలో ఐదు ప్రైవేటు రిసార్టులు వున్నాయి. వీటిపై పోలీసుల నిఘా లేకపోవడంతో కొన్నిసార్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా వీటిలో ఒక రిసార్టును అధికార వైసీపీకి చెందిన స్థానిక నాయకుడు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో ఇతను పెత్తనం చేస్తుండడంతో అందరూ 'సూపర్ సర్పంచ్'గా పిలుస్తుంటారు.

దీంతో ఈ రిసార్టులో నిబంధనలకు విరుద్ధంగా జరిగే కార్యక్రమాల గురించి పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ బుధవారం రాత్రి సుమారు 20 మంది కలిసి ఇక్కడ పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో నలుగురు యువతులు కూడా ఉన్నారు. అబ్బాయిలు అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించారు. రెయిన్ డ్యాన్సులు చేశారు. అయితే మద్యం మత్తులో ఉన్న యువకులు.. నగ్నంగా డ్యాన్స్ చేయాలని యువతులను బలవంతం చేశారు. దీంతో తీవ్రభయాందోళన చెందిన యువతుల్లో ఒకరు డయల్ పోలీసు 100 నంబర్‌కు కాల్ చేశారు. అచ్యుతాపురం స్టేషన్‌కు చెందిన ఇద్దరు పోలీసులు అర్ధరాత్రి తరువాత రిసార్టుకు వెళ్లారు. పోలీసులు వస్తున్నట్టు అప్పటికే సమాచారం రావడంతో పలువురు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు వెళ్లేసరికి ఇద్దరు యువకులు, నలుగురు యువతులు ఉన్నారు. వీరిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా ఈ సంఘటనపై అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తమకు సమాచారం రాగానే వెంటనే పోలీసులను పంపి అక్కడున్న వారిని స్టేషన్‌కు రప్పించామన్నారు. చిన్నపాటి ఘర్షణ జరిగిందని వారు చెప్పడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. యువతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయకుండా మందలించి పంపించి వేశామని సీఐ చెప్పారు.

ప్రజా సహకారంతోనే అభివృద్ధి

మేయర్ గొలగాని హరివెంకటకుమారి



భానోజీతోటలో శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

పెదగంట్యాడ, ఫిబ్రవరి 23: ప్రజా సహకారం లభిస్తేనే ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధ్యమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి బీసీ రోడ్డు, భానోజీతోటలో సుమారు రూ.33లక్షలతో చేపట్టనున్న కల్వర్టులు, కాల్వల నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణకు రూ.ఆరు కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసీపీ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, డీఈ అప్పారావు, ఎం.అప్పారావు, దేముడు, మంగునాయుడు, మంత్రి మంజుల పాల్గొన్నారు.

సమస్యలపై జెడ్సీకి వినతి

అగనంపూడి, ఫిబ్రవరి 23: గాజువాక జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.సన్యాసినాయుడును 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వార్డు పరిధిలోని ప్రధాన సమస్యలను ఆయనకు వివరించారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటానని జెడ్సీ హామీ ఇచ్చారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలి

అగనంపూడి, ఫిబ్రవరి 23: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, పరిసర ప్రాంత కాలనీల్లో విద్యుత్ సమస్యలపై గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్) పర్సన్ ఇన్‌చార్జి ఎం. శ్యామలను స్థానిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అగనంపూడి ప్రాంతంలో ఇటీవల విద్యుత్ సర్వీసులు పెరగడంతో గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తుతుందన్నారు. సర్వీసులకు తగినట్లు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వడ్లపూడిలో రామాలయ నిర్మాణం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 23: జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడిలో నూతనంగా చేపడుతున్న రామాలయం ఆలయ సముదాయాల నిర్మాణాలను శుక్రవారం కార్పొరేటర్ బొండా జగన్ పరిశీలించారు. పలు సూచలందించారు. ఈ ఆలయ ప్రారంభోత్సవం మార్చిలో నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మద్యం దుకాణాల పరిశీలన

గాజువాక, ఫిబ్రవరి 23: గాజువాక పరిధిలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.నరసింహరాజు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి ఉల్లంఘనలు చేయరాదని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

గార్బేజ్ సెంటర్ పరిశీలన

వేపగుంట ఫిబ్రవరి 23: చీమలాపల్లి డంపింగ్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటుచేస్తున్న సీపీఎస్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ద్వారా చెత్త తరలింపు ప్రక్రియను 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు శుక్రవారం పరిశీలించారు. స్టేషన్ ఏర్పాటుతో చెత్తను ఎప్పటికప్పుడు లారీల్లో కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల యార్డు పరిసరాల్లో కాలుష్య సమస్య తొలగుతుందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో యార్డ్ ఇన్‌చార్జి లాజరస్, గార్బేజ్ స్టేషన్ మేనేజర్ సందీప్, ఎర్రయ్య, అప్పారావు, దేముడుబాబు, సంతోష్, గోవింద్, రాము, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర

● **సిద్దార్ధ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

● **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 21, టమాటా 18, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 42, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 48, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజి 22, క్యారెట్ 22, దొండకాయలు 38, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 105, బరబాటి 30, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోసకాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

నిర్వాసిత కాలనీల్లో పార్కుల నిర్మాణమేదీ?

- దశాబ్దాలుగా ఖాళీగా స్థలాలు
- ఆక్రమణకు తెగబడుతున్న అక్రమార్కులు
- దృష్టి సారించని జీవీఎంసీ అధికారులు



దుర్గవానిపాలెంలోని పార్కు స్థలం



కోరాడ నిర్వాసిత కాలనీలోని పార్కు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 23: పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లోని పార్కు స్థలాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రతి కాలనీకి ఒకటి రెండు పార్కు స్థలాలు ఉన్నప్పటికి అభివృద్ధి చేయలేదు. గాజువాక మునిసిపాలిటీగా ఉన్న సమయంలోనూ, జీవీఎంసీలో విలీనం తరువాతా వీటి పరిస్థితి మారలేదు. నిర్వాసిత కాలనీ ప్రజల ఆహ్లాదం కోసం స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం ప్రతి కాలనీలో పార్కు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించింది. పెద్ద కాలనీకి రెండు చోట్ల ఇచ్చింది. పెదగంట్యాడ, నెల్లిముక్కు, సీతానగరం, దుర్గవానిపాలెం, కోరాడ, సిద్ధేశ్వరం, నడుపూరులో స్థలాలు ఉన్నప్పటికీ 40 సంవత్సరాలుగా వీటిని పట్టించుకోకపోవడంతో కొన్ని స్థలాలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. మరికొన్ని కొంతమేర బక్కచిక్కాయి. ఆలస్యంగా గుర్తించిన జీవీఎంసీ ఇటీవల వాటికి ప్రహరీ నిర్మాణాలు చేపట్టింది. పార్కు స్థలాల్లో వాకింగ్ ట్రాక్, పిల్లల జిమ్, బెంచీలు బల్లలు, అందమైన పూల మొక్కలు, నీటి వసతి వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడంలేదు. పార్కు స్థలాలను స్థానికులు డంపింగ్ యార్డులా వినియోగించుకుంటున్నారు. పార్కులు నిర్మించాలని జీవీఎంసీ అధికారులకు స్థానికులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఇరవై ఏళ్లుగా కోరుతున్నాం



దుర్గవానిపాలెం, కోరాడ నిర్వాసిత కాలనీల్లోని పార్కుస్థలాలను అభివృద్ధి చేసి ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ అధికారులకు రెండు దశాబ్దాలుగా కోరుతున్నాం. కార్పొరేటర్ల దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఇంతవరకు ఎటువంటి ప్రగతి లేదు. ప్రజా సంక్షేమంలో భాగంగా పార్కులను అభివృద్ధి చేసి, కాలనీల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని కోరుతున్నాం. -ఎం.పెంటయ్య, దుర్గవానిపాలెం

ఆటోనగర్‌లో ఆర్‌వోబీ పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, పక్కన మేయర్, ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఆటోనగర్, ఫిబ్రవరి 23: ఆటోనగర్ అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన డి బ్లాక్‌లోని చుక్కవానిపాలెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద అసంపూర్తిగా నిలిచిన ఫ్లై ఓవర్ పనులను శుక్రవారం మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్ అండ్ సీఆర్ఎఫ్ సేతుబంధన్ ప్రాజక్టులో భాగంగా ఫ్లైఓవర్ వంతెన పనులు రూ.16 కోట్లతో ప్రారంభించినట్టు చెప్పారు. ఈ వంతెన పూర్తయితే వీఎస్ఈజెడ్‌లో వివిధ కర్మాగార కార్మికులు, దువ్వాడ రైల్వే స్టేషన్ ప్రయాణికులు, సమీప గ్రామాల ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. సమీప గ్రామాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అప్రోచింగ్ రోడ్ల నిర్మాణ బాధ్యతను ఏపీఐఐసీ బాధ్యత వహించాలన్నారు. గాజువాకలో కూడా ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాకి గోవింద రెడ్డి, బొండా జగన్, బొడ్డ గోవింద్, బోగాది సన్ని, విజయరామరాజు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో భవిత సెంటర్ ప్రారంభం



భవిత సెంటర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

గోపాలపట్నం, ఫిబ్రవరి 23 : ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ సూచించారు. స్థానిక లక్ష్మీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రంలో వారంలో రెండు రోజులు ఫిజియోథెరపీతో పాటు బధిరులైన విద్యార్థులకు స్పీచ్ థెరపీ నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కేంద్రం సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు, ఏఎస్‌వో గీత, ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్, డీపీవో డి. అప్పలనాయుడు, హెచ్‌ఎం వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

110 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

మల్కాపురం, ఫిబ్రవరి 23 : శ్రీహరిపురంలోని కళంజియం సమాఖ్య కార్యాలయంలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సహకారంతో ధాన్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం కేన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 110 మందిని పరీక్షించి ఆరుగురు కేన్సర్‌తో ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించి, వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కళంజియా ప్రతినిధులు మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన స్త్రీలు ఎప్పటికప్పుడు గైనిక్‌కు సంబంధించి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. బ్రెస్ట్‌లో గడ్డలకు సంబంధించిన స్వీయ పరీక్షలు చేసుకోవాలని, నెలసరిలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుభద్ర, సౌజన్య, ఏరియా బిజినెస్ మేనేజర్ శివ రామకృష్ణ, వైజాగ్ రీజనల్ హెల్త్ కో ఆర్డినేటర్లు మురళీకృష్ణ, సమాఖ్య కోఆర్డినేటర్ సుబాషిణి, హెల్త్ స్టాఫ్ విజయ, రాజ్యలక్ష్మి, సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

'అభివృద్ధిపై ప్రతిపక్షాల విమర్శలు సరికాదు'

మల్కాపురం, ఫిబ్రవరి 23: ప్రభుత్వ అభివృద్ధి పనులపై ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని ఆ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి శరగడం పత్నీరావు అన్నారు. శుక్రవారం ఆయన 60వ వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించి, సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో జనసేన నేత శివశంకర్, తదితరులు

వేపగుంట, ఫిబ్రవరి 23 : జీవీఎంసీ 93 వార్డు ఆర్ఆర్‌వీ పురంలో ఉన్న సీతారామ గణపతి సహిత ఆంజనేయ సాయి ఆలయ 20వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మారెడ్డి శివశంకర్, పెందుర్తి నాయకుడు కంచిపాటి విశ్వనాథనాయుడు, తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పరస ఉత్సవంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సేనాపతి సోమశేఖర్, మామిడి శంకరరావు, పిన్నింటి పార్వతి, శ్రీకాంత్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రన్నాయుడు జయంతి

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 23: కేంద్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకులు దివంగత కింజరపు ఎర్రన్నాయుడు జయంతి శుక్రవారం గాజువాక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్రన్నాయుడు వెనకబడిన వర్గంలో పుట్టి కేంద్రమంత్రిగా ఎదిగారన్నారు. ప్రజలకు ఎన్నో సేవలందించారన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన కార్యక్రమంలో బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.



పెదగంట్యాడలో ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు

మచ్చలేని నేత ఎర్రన్నాయుడు

పెదగంట్యాడ: మచ్చలేని నాయకుడుగా మాజీ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడు పేరు పొందారని 75 వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. ఎర్రన్నాయుడు 67వ జయంతి వేడుకలు శుక్రవారం సాయంత్రం పెదగంట్యాడ టీడీపీ కార్యాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీబాయి ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, నేతలు శ్రీముసిరి శ్రీనివాసరావు, ములకలపల్లి పెంటయ్య, అండిబోయిన రామునాయుడు, అప్పారావు, పెరుమాళ్ల, బొంగురాజు, ముత్యాలు, మొల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

శ్రీహరిపురంలో సక్రమంగా వెలగని వీధి దీపాలు

మల్కాపురం, ఫిబ్రవరి 23: శ్రీహరిపురంలో వీధి లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వ్యాపారాలు సాయంత్రం ఆరు గంటలకే దుకాణాలు మూసుకొని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. కోరమాండల్ ఎరువుల కర్మాగారం నుంచి శ్రీహరిపురం మహాత్మాగాంధీ మార్కెట్ వరకు అనేక దుకాణాలున్నాయి. వీటన్నింటికీ విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ మెయిన్ రోడ్డులో వీధి లైట్ల వెలుగులు సరిపోవడం లేదు. ముఖ్యంగా డివైడర్ మధ్య ఉన్న లైట్ల వెలుగులకు చెట్టు కొమ్మలు అడ్డువస్తున్నాయి. దీంతో చీకటి పడిన తరువాత ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంటోంది. వ్యాపారలు దుకాణాలు నడపలేక సాయంత్రం ఆరు గంటలకే మూసి వేస్తున్నారు. అలాగే ఇటువైపుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పం దించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చెట్టు కొమ్మల మధ్య ఉన్న వీధి లైటు

ప్రధాన రహదారుల్లో రేగుతున్న ధూళి

- వాహనాల రాకపోకలతో సమస్యలు
- శ్వాస కోశ వ్యాధులతో స్థానికుల అవస్థలు

గాజువాక, ఫిబ్రవరి 23: స్థానిక వై జంక్షన్, పోర్టు రోడ్డు, పాతకర్నవానిపాలెం ప్రధాన రహదారుల్లో నిత్యం భారీ వాహనాలు రాకపోకలతో స్థానికులు దుమ్ము, ధూళితో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలతో ఇళ్ల పరిసరాలు ధూళితో నిండిపోతోంది. ఫలితంగా శ్వాస కోశ తదితర పలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. స్వతంత్రనగర్, ఎస్టీ కా లనీ, పాతకర్నవానిపాలెం తదితర కాలనీలు వై జంక్షన్ రోడ్డుకు ఆనుకుని ఉండటంతో ఈ కాలనీల ప్రజలకు నిత్యం నరకయాతన ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను స్థానికులు పలుమార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లను అభివృద్ధి చేసి, ఇరువైపులా మొక్కలు నాటాలని స్టీల్‌ప్లాంట్, పోర్టు యాజమాన్యాలకు స్థానిక అధికారులు ఆదేశించారు. ప్రధానంగా జగ్గు జంక్షన్ మీదుగా వై జం క్షన్ నుంచి ప్రధాన రహదారి స్టీల్‌ప్లాంట్ వైపు, మరో ప్రధాన రహదారి పోర్టునకు ఉన్నాయి. కాగా, స్టీల్‌ప్లాంట్, పోర్టుకు వాహనాల తాకిడితో ధూళి రేగుతోందని పరిసర కాలనీల ప్రజలు వాపోతున్నారు. అలాగే, వై జంక్షన్ స్టీల్‌ప్లాంట్ రోడ్డు వైపు పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పోర్టు రోడ్డు వైపు మొక్కలు పెంచకపోవడంతో ఈ రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలనీల్లో కాలుష్యం వెంటాడుతోంది. ఇకనైనా అధికారులు స్పం దించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



లారీల రాకపోకలతో దుమ్ము, ధూళి రేగుతున్న దృశ్యం

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



మాట్లాడుతున్న గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, ఫిబ్రవరి 23: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, అప్పుడే పజలు సుఖంగా ఉంటారని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. బీజేపీ ప్రజా పోరుయాత్ర శుక్రవారం 64వ వార్డు యాతపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన అంతమయ్యే వరకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ నెల 29వరకు నియోజకవర్గంలో పోరుయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గూటూరు శంకరరావు, రోహిణి, పద్మ, బొండా యల్లాజీరావు పాల్గొన్నారు.

27న 'ఉక్కు' పరిరక్షణ పాదయాత్ర

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 23: ప్రధానమంత్రి విశాఖ పర్యటన నేపథ్యంలో ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానమంత్రితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయించేలా డిమాండ్ చేద్దామన్నారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు ప్రధానమంత్రిపై ఒత్తిడి తెవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25వతేదీన ఉక్కు నిర్వాసిత కాలనీల్లో పాదయాత్రలు, 27న రిలే నిరాహారదీక్ష శిబిరం నుంచి జీవీఎంసీ వరకు పాదయాత్ర చేపట్టనున్నామన్నారు. సమావేశంలో పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, కో-కన్వీనర్లు జె.అయోధ్యరాం, నీరుకొండ రామచంద్రరావు, ప్రతినిధులు విల్లా రామ్మోహన్‌కుమార్, మసేన్‌రావు, నరేశ్‌కుమార్, డీవీ రమణారెడ్డి, సన్యాసిరావు, నమ్మి సింహాద్రి, వైటి.దాసు, యు.రామస్వామి పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ వైద్యులకు గోల్డ్ మెడల్



పతకాలతో వైద్యులు (డాక్టర్ శ్రీకాంత్ ఎడమ నుంచి మూడో వ్యక్తి)

వేపగుంట, ఫిబ్రవరి 23: నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్, ఆర్పీ బాలచంద్ర గోల్డ్ మెడల్ అందుకున్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో శుక్రవారం జరిగిన మహారాష్ట్ర హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్నాతకోత్సవంలో ఎంఎస్ నేత్ర వైద్యంలో మొదటి స్థానంలో నిలిచిన శ్రీకాంత్‌కు యూనివర్సిటీ వీసీ, లెఫ్టినెంట్ జనరల్ మాధురీ కనిట్కర్ (రిటైర్డ్) చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదాతలను అభినందిస్తున్న సీఎండీ హేమంత్ ఖత్రీ

మల్కాపురం, ఫిబ్రవరి 23: రక్తదానం మరొకరికి ప్రాణ దానమని షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ అన్నారు. షిప్‌యార్డు యాజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం సంస్థలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో షిప్ యార్డు ప్రధాన వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు, ఉన్నతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు, వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

రాత్రి సమయాల్లో యువత అలవాట్లపై సర్వే

మల్కాపురం, ఫిబ్రవరి 23: యువత రాత్రి సమయాల్లో ఎటువంటి అలవాట్లు పాటిస్తున్నారో తెలుసుకోవడానికి పారిశ్రామిక ప్రాంతంలో కేరళకు చెందిన పరిశోధకుడు నితిన్ సర్వే చేపట్టారు. ఆయనకు ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి సహకరించారు. సర్వే ద్వారా యువత రాత్రి సమయాల్లో పబ్బులు, క్లబ్బులు, సామాజిక మాధ్యమాల్లో ఎన్ని గంటలు వృథాగా గడుపుతున్నది అంచనా వేశారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటు వంటి వాటిపై సర్వే చేశారు. సెయింట్ ఆన్స్, చైతన్య, ఎంవీఆర్ , టీఎస్ఆర్, టీటీకే కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్నకు వైభవంగా క్షీరాభిషేకం



పెందుర్తి, ఫిబ్రవరి 23: స్థానిక వెంకటాద్రి శిఖరంపై వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి అత్యంత వైభవంగా క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అభిషేకోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంట్రాక్టు నర్సుల సర్వీసు క్రమబద్ధీకరించాలి


ఎంపీ సత్యనారాయణకు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట, ఫిబ్రవరి 23: కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల స్ట్రగుల్ కమిటీ (కేజీహెచ్) సభ్యులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శుక్రవారం విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సభ్యురాలు షేక్ షహీరా బేగం మాట్లాడుతూ, ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తున్న జాబితాలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. కొవిడ్ సమయంలో తాము ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు సేవలు అందించామని గుర్తు చేశారు. ఈస్థితిలో ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేయ రాదని కోరారు. తమను రెగ్యులర్ చేసే వరకు వంద శాతం గ్రాస్ శాలరీ అందించాలని కోరారు.

'రెల్లి సామాజిక వర్గానికి 'దక్షిణ' టికెట్ ఇవ్వాలి'

మహారాణిపేట, ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ రెల్లి సామాజిక వర్గానికి కేటాయించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కస్తూరి వెంకటరావు కోరారు, శుక్రవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ మేరకు ఆయన దరఖాస్తును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో సేవలందిస్తున్నానన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయురాలు


కుటుంబ సభ్యులతో ఫాతిమ

దొండపర్తి, ఫిబ్రవరి 23: టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న ఫాతిమను శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు..ఆమె సోదరుడు రషీద్ అలీగాజీకి అప్పగించినట్లు గృహం మేనేజర్ కె. జ్యోతిర్మయి తెలిపారు. ఫాతిమ తన భర్త వివాహేతర సంబంధాన్ని చూసి తట్టుకోలేక మానసిక ఒత్తిడితో 9 నెలల క్రితం పశ్చిమ బెంగాల్‌లోని మజిల్ పుర తాలుకాలోని బిల్వార గ్రామం నుంచి విశాఖకు వచ్చేసింది. కంచరపాలెం పోలీసుల సహకారంతో గత అక్టోబరులో ఫాతిమను రెస్క్యూ చేసి వైద్యం అందించినట్లు చెప్పారు. కోలుకోవడంతో ఆమెను సోదరుడు రషీద్‌కు అప్పగించామన్నారు.

వైశాఖీ పార్కు అధ్యక్షునిగా వరప్రసాద్


వరప్రసాద్

మురళీనగర్, ఫిబ్రవరి 23 ; గ్రేటర్ 50వవార్డు లోని వైశాఖీ స్పోర్ట్సు పార్కు కమిటీ పాలకవర్గ అధ్యక్షునిగా సనపల.వరప్రసాద్ ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. రెండేళ్ల పదవీ కాలానికి జరిగిన ఎన్నికలో కాలనీ వాసుల అత్యధిక శాతం ఆయనకు మద్దతిచ్చారు.ఈ మేరకు ఎన్నికల అధికారులు వర వరప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రమందించారు. ఆయనతో పాటు మరో 9 మంది సభ్యులు పాలకవర్గంలో కొనసాగుతారు.

పేదలకు చీరలు పంపిణీ

మహారాణిపేట, ఫిబ్రవరి 23: దక్షిణ నియోజకవర్గ పరిధి 29 వ వార్డులోని ఊటగెడ్డ, సూర్యనగర్ తదితదితర ప్రాంతాల్లో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ ఇంటింటికి వెళ్లి చీరలు పంపిణీ చేశారు. అల్పాదాయ వర్గాల అభ్యున్నతి కోసం పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ,కండిపల్లి సతీశ్, చోల్లంగి శేఖర్. ఓమ్మి కిశోర్, పల్లా రాధాలక్ష్మి పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపుతోనే ప్రజలకు సుఖ శాంతులు'


42వ వార్డులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

దొండపర్తి, ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలంటే టీడీపీని గెలిపించాలని విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అకిరెడ్డి జగదీష్ అన్నారు. గ్రేటర్ 42వ వార్డులో శుక్రవారం శంఖారావం కార్యక్రమం జరిగింది. ఈ మేరకు నాయకులు వార్డులోని ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నం వెంకటరమణారావు, ముక్కి రామకృష్ణ, కాపు కార్పొరేషన్ మాజీ కార్యదర్శి ఎంఎల్ఎన్ రావు, వార్డు మహిళా అధ్యక్షురాలు కుప్పిలి కుంతీదేవి, సీత, సీహెచ్ రమణమ్మ, ఎం. మాధవి, కుమారి, వేణమ్మ పాల్గొన్నారు.

విమ్స్‌లో సీబీఆర్ఎన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఆరిలోవ, ఫిబ్రవరి 23: విమ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సెకండరీ లెవెల్ కెమికల్, బయో లాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌కు సంబంధించిన స్థలాన్ని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ సీనియర్ రీజనల్ డైరెక్టర్ ఎం. అనురాధ ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలోని 12వ బ్లాక్‌లో ఉన్న స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్ బ్లడ్ బ్యాంకు, క్యాజువాలిటీ వార్డులను పరిశీలించారు. కమిటీ సభ్యులకు విమ్స్ డైరెక్టర్ రాంబాబు ఆసుపత్రిలోఉన్న మౌలిక సదుపాయాల గురించి వివరించారు. త్వరలోనే ఆసుపత్రిలో సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని బృంద సభ్యులు చెప్పారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం తిరోగమనం

» దక్షిణ ఇన్‌చార్జి గండిబాబ్జీ


కరపత్రాలు అందిస్తున్న గండి బాబ్జీ, టీడీపీ నాయకులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 23: వైసీపీ గత నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల అభివృద్ధిలో వెనక్కి వెళ్లిపోయిందని టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం గ్రేటర్ 37వ వార్డులో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడం చాలా అవసరమన్నారు. చం ద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉందని పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలతోపాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలుంటాయన్నారు ప్రధానంగా మహిళల కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో తీవ్ర నష్టం జరిగిందన్నారు. తిరిగి రాష్ట్రం కోలుకోవాలంటే ప్రజలంతా కలసికట్టుగా టీడీపీని రానున్న ఈసారి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వార్డు స్థాయి నాయకులు, మహిళలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23 : దేశ ప్రజల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణుకుమార్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పలు సంస్కరణలతో పాలన సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలంతా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అక్కయ్యపాలెం మండల అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, కొప్పిశెట్టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23 : గ్రేటర్ 45వవార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో ఏఎస్ఆర్‌నగర్‌లో టిడ్కో ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం లబ్ధిదారులకు ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కేకే రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఏపీడీ పద్మావతి, నాయకులు హరి పట్నాయక్, ఆదిలక్ష్మి, నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనకు మద్దతు ఇవ్వండి

» జనసేన నాయకురాలు ఉషాకిరణ్


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉషాకిరణ్

కంచరపాలెం, ఫిబ్రవరి 23: ఛిన్నాభిన్నమైన రాష్ట్ర భవిష్యత్ మళ్లీ ఒక గాడిలో పడాలంటే టీడీపీ జనసేన అధికారం చేపట్టాలని ఉత్తర నియోజకవర్గ జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. జీవీఎంసీ 47వ వార్డు పరిధి కప్పరాడ, పెదకొత్తూరు గ్రామాల్లో శుక్రవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు వైసీపీ అధికారం చేపట్టాక యువతకి ఉపాధి కరువైందన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టారన్నారు.గంజాయి మత్తులో యువత భవిష్యత్తు నాశనమవుతుందన్నారు.గంజాయిని నిరోధించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎం.రాజారావు, ఎం. మోసెస్, సురేశ్, ఫణి, రఫీ జాన్సన్, అప్పలకొండ, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

» డీఈవో చంద్రకళ


విజేతలకు కప్ అందచేస్తున్న డీఈఓ చంద్రకళ

సీతమ్మధార, ఫిబ్రవరి 23: విద్యార్థులు చదువుతోపాటు ఉపాధి కల్పనకు గల అవకాశాలను అన్వేషిస్తూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. గురుద్వారా మందిరం సమీపంలోని వసంతబాల విద్యోదయ పాఠశాలలో ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ (ఈఎండీపీ) జిల్లాస్థాయి ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. 11 పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా డీఈవో, డి ప్యూటీ డీఈఓ గౌరిశంకర్, ఏపీసీ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి కెప్రసాద్, ఎంఈవో ఈ నమూనాలను పరిశీలించి విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సైన్స్ ప్రదర్శనలో జ్ఞాన నికేతన్ ఎయిడెడ్ స్కూల్‌కి ప్రథమ స్థానం, రైల్వే న్యూకాలనీ జీహెచ్ఎస్ పాఠశాలకు ద్వితీయ స్థానానికి ఎంపికైంది. ఈ రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపికచేసినట్టు అధికారులు తెలిపారు. జ్యూరీ కమిటీ సభ్యులుగా టీ రామ్‌కుమార్, లక్ష్మి వ్యవహరించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీపీ స్టేట్ హెడ్ సతీష్, జోనల్ మేనేజర్ అగ్నిహోత్ర శర్మ, జిల్లా మేనేజర్ నరేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతకు ఎర్రన్నాయుడు పోరాటం స్ఫూర్తి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


కింజరాపు ఎర్రన్నాయుడు చిత్రపటానికి టీడీపీ నాయకులు

మహారాణిపేట, ఫిబ్రవరి 23: దివంగత టీడీపీ నేత కింజరాపు ఎర్రన్నాయుడు పోరాట పటిమను యువ నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు .శుక్రవారం పార్టీ కార్యలయంలో ఎర్రన్నాయుడు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్లమెంట్‌లో ఉత్తరాంధ్ర సమస్యలను ఎ ర్రన్నాయుడు బలంగా వినిపించేవారన్నారు. కేం ద్ర మం త్రిగా ఆయన ఎన్నో సేవలందించారన్నారు. ఆయన ఆశయాలను పార్టీ నాయకులంతా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కో రాడ రాజబాబు, పాశర్లప్రసాద్ , పైలా ముత్యాల నాయుడు , లొడగల కృష్ణ, విల్లూరి చక్రవర్తి పాల్గొన్నారు.

జేసీఎల్‌ను సస్పెండ్ చేయాలి

» నెల్లిమర్ల మిమ్స్ కార్మికుల నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ నేత సూర్యనారాయణ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23: విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఆ యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ (జేసీఎల్) గణేశ్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయూ ఆ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిలోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 23 రోజులుగా మిమ్స్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కార్మిక శాఖాధికారుల చుట్టూ తిరుగుతున్నా వారు పట్టించుకోవడంలేదన్నారు. విశాఖ జేసీఎల్ వద్ద చర్చలు పేరిట యాజమాన్యం, వారికి అనుకూలంగా ఉన్న నలుగురు కార్మికులను అధి కారులు ఆహ్వానించారన్నారు. ఈస్థితిలో ఉద్యోగులంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడుతున్నారని చెప్పారు. యాజమాన్యం ఉద్యోగుల పక్షాన ఆలోచించి పరిష్కారం చేయాలని హితవు పలికారు. యాజమాన్యం ఇప్పటి వర కు ఉద్యోగులకు జనవరి నెల జీతం చెల్లించలేదన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించకుంటే కుటుం బ సభ్యులతో కలిసి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేశ్, ఉద్యో గులు మిరపనారాయణ, కర్రోతు కామునాయుడు, మహంతి నాగభూషణం, మధు, మూర్తి, రాంబాబు, గౌరి, వరలక్ష్మి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండకర్ల రిసార్ట్‌లో అడ్డగోలు వ్యవహారాలు

» పార్టీ పేరుతో మద్యం సేవించిన యువకులు
» యువతులతో కలిసి రెయిన్ డ్యాన్స్
» శ్రుతి మించి.. నగ్నంగా డ్యాన్స్ చేయాలని అమ్మాయిలపై ఒత్తిడి
» డయల్ 100కు ఫోన్ చేసిన ఓ యువతి
» పోలీసులు వెళ్లినప్పటికే పలువురు పరారీ
» కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేసిన పోలీసులు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని కొండకర్ల ఆవ సమీపంలో అధికార పార్టీ నాయకుడికి చెందిన ఒక రిసార్ట్‌లో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కొంత మంది యువతీ యువకులు ఇక్కడ పార్టీ చేసుకున్నారు. మద్యం సేవించి వున్న యువకులు, నగ్నంగా డ్యాన్స్ చేయాలని యువతులను బలవంతంగా చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు రిసార్ట్ వద్దకు వెళ్లారు. అధికార పార్టీ నేతకు చెందిన రిసార్ట్ కావడంతో పార్టీ చేసుకున్న యువతీ యువకులను హెచ్చరించి వదిలేశారు. దీనికి సంబంధించి విశ్వసనీయ వర్గాలు సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ సమీపంలో ఐదు ప్రైవేటు రిసార్టులు వున్నాయి. వీటిపై పోలీసుల నిఘా లేకపోవడంతో కొన్నిసార్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా వీటిలో ఒక రిసార్టును అధికార వైసీపీకి చెందిన స్థానిక నాయకుడు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో ఇతను పెత్తనం చేస్తుండడంతో అందరూ 'సూపర్ సర్పంచ్'గా పిలుస్తుంటారు.

దీంతో ఈ రిసార్టులో నిబంధనలకు విరుద్ధంగా జరిగే కార్యక్రమాల గురించి పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ బుధవారం రాత్రి సుమారు 20 మంది కలిసి ఇక్కడ పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో నలుగురు యువతులు కూడా ఉన్నారు. అబ్బాయిలు అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించారు. రెయిన్ డ్యాన్సులు చేశారు. అయితే మద్యం మత్తులో ఉన్న యువకులు.. నగ్నంగా డ్యాన్స్ చేయాలని యువతులను బలవంతం చేశారు. దీంతో తీవ్రభయాందోళన చెందిన యువతుల్లో ఒకరు డయల్ పోలీసు 100 నంబర్‌కు కాల్ చేశారు. అచ్యుతాపురం స్టేషన్‌కు చెందిన ఇద్దరు పోలీసులు అర్ధరాత్రి తరువాత రిసార్టుకు వెళ్లారు. పోలీసులు వస్తున్నట్టు అప్పటికే సమాచారం రావడంతో పలువురు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు వెళ్లేసరికి ఇద్దరు యువకులు, నలుగురు యువతులు ఉన్నారు. వీరిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా ఈ సంఘటనపై అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తమకు సమాచారం రాగానే వెంటనే పోలీసులను పంపి అక్కడున్న వారిని స్టేషన్‌కు రప్పించామన్నారు. చిన్నపాటి ఘర్షణ జరిగిందని వారు చెప్పడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. యువతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయకుండా మందలించి పంపించి వేశామని సీఐ చెప్పారు.

ఫ్లోటింగ్ జట్టీ వద్దకు సేఫ్టీ బోట్లు


బీచ్‌లో సందర్శకుల భద్రత కోసం సిద్ధం చేసిన బోట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వైఎంసీఏ ఎదురుగా బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జి వద్ద సందర్శకుల భద్రత కోసం సేఫ్టీ బోట్లు తీసుకువచ్చారు. ఫ్లోటింగ్ బ్రిడ్జి నుంచి సముద్ర అలల వరకు వెళ్లే సమయంలో సందర్శకులు ప్రమాదంలో పడినా తక్షణమే వారిని రక్షించడానికి ఈ బోట్లు సిద్ధంచేశారు.

ఏయూలో గంజాయ్!

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులే పేర్కొంటున్నారు.

కఠినంగా వ్యవహరిస్తేనే...

బయటి విద్యార్థులు క్యాంపస్‌లోకి గంజాయి తీసుకుని వచ్చారంటే సెక్యూరిటీ ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మధ్యాహ్నం వేళ క్యాంపస్‌తో సంబంధం లేని వారు బ్యాగులతో సహా వర్సిటీలోకి వెళుతున్నా సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్యాంపస్‌లోకి అడుగుపెట్టాలంటే ఐడీ కార్డులు తప్పనిసరి చేస్తూ గతంలో అధికారులు ఆదేశాలు జారీచేశారు. వాటిని సక్రమంగా పాటించకపోవడం వల్లే తాజా ఘటన చోటుచేసుకుందంటున్నారు. ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్న విద్యార్థులు ఇంకెంతమంది క్యాంపస్‌కు వచ్చి, వెళుతున్నారోననే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో మరింత కఠినంగా ఉంటామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇకపై వర్సిటీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేలా ఆదేశాలు జారీచేశామని, వసతి గృహాలకు బయటివారు రాకుండా చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ స్టీఫెన్ పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల వల

... 5వ పేజీ తరువాయి

చేశారో గుర్తించగలుతున్నారు. అయితే జార్ఖండ్, ఢిల్లీ తదితర ప్రాంతాలతోపాటు నైజీరియా వంటి దేశాల నుంచి మోసానికి పాల్పడినట్టు తేలడంతో వారిని పట్టుకోవడం సాధ్యం కావడం లేదు.

బ్యాంకు అధికారులు వివరాలు అడగరు

బ్యాంకు అధికారుల వద్ద ఖాతాదారుల వివరాలన్నీ అందుబాటులో ఉంటాయి. వివరాలను అడగాల్సిన అవసరం వారికి ఉండదు. సైబర్‌క్రైమ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా బాధితులు పెరుగుతుండడం విచారకరం. బ్యాంకుల నుంచి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే కట్ చేసేయాలి. మెసేజ్‌లకు స్పందించకుండా డిలీట్ చేసేయాలి. సైబర్ నేరగాళ్లు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నెట్ కాల్స్ ద్వారా మాట్లాడి మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఆ నంబరుకు తిరిగి ఫోన్ చేసినా కలవదు. బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డుల వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దు.

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

ఆశావహుల్లో ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి సీటు ఆశిస్తున్నారు. ఆయన గతంలో పెందుర్తి, ఎలమంచిలి నుంచి రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక విశాఖ సిటీ అధ్యక్షునిగా ఉన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ గతంలో తూర్పు నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆయన మరోసారి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు. అలాగే పసుపులేటి ఉషాకిరణ్ (ఉత్తరం), పంచకర్ల సందీప్ (భీమిలి) వంటివారు నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్నారు.

ఇంటర్ బోర్డు వివక్ష

... 5వ పేజీ తరువాయి

విధానాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలలో కాకుండా చుట్టుపక్కల వున్న వేరే కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయిస్తున్నారు. ఈ మేరకు 15 కిలోమీటర్ల పరిధిలో వున్న కాలేజీలను మాత్రమే పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేయాలి. కాగా అచ్యుతాపురంలో నాలుగు జూనియర్ కళాశాలలు ఉండగా, మూడు కళాశాలల విద్యార్థులకు వీటిల్లో ఒక కాలేజీని పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశారు. అయితే అచ్యుత జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఇక్కడ పరీక్షా కేంద్రం కేటాయించలేదు. జంబ్లింగ్ పేరుతో 20 కిలోమీటర్ల దూరంలో వున్న ఎలమంచిలి దరి కొక్కిరాపల్లిలో, 28 కిలోమీటర్ల దూరంలో వున్న కశింకోట మండలం తాళ్లపాలెంలోని కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. అచ్యుత కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో దివ్యాంగ (అంధ, బధిర, మూగ, శరీర వైకల్యం కలిగిన) విద్యార్థులు ఐదుగురు ఉన్నారు. వీరికి జంబ్లింగ్ వర్తించదన్న నిబంధనను అధికారులు బేఖాతరు చేశారు. కాగా 15 కిలోమీటర్లలోపు అనే నిబంధనను ఇంటర్ బోర్డు అధికారులు తుంగలో తొక్కడమే కాకుండా దివ్యాంగ విద్యార్థులన్న కనికరం కూడా లేకుండా సుదూరంలో వున్న కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. దీనిపై కళాశాల నిర్వాహకులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్, ఫిబ్రవరి 23; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఈనెల 24వతేదీ శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి తెలిపారు. ఆల్ఫా మెడికల్ సెర్వీసెస్ వైద్య బృందం సాయంతో దీనిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా గుండె వ్యాధి చికిత్సలు, ఈసీజీ పరీక్షలు, ఈఎన్‌టీ రుగ్మతలకు చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

మహారాణిపేట, ఫిబ్రవరి 23: గ్రేటర్ 29 వ వార్డు చందక వీధిలో ఎన్టీఆర్ సేవా సమితీ ట్రస్టు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు గండి వంశీదీప్ మహిళలకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల శిబిరంలో వైద్యుల సూచనల మేరకు ఎంపిక చేసిన వారికి అందించారు. మధు, సత్యనారాయణ, గణేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యనారాయణ

పలు ప్రాంతాల్లో ఎంపీ పాదయాత్ర

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 22 : వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఆయన 9 వార్డులోని హనుమంతవాక రామాలయం ఎదురుగా ఉన్న కొండవాలు ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 23 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొదల పావని అన్నారు. శుక్రవారం పెంట, కొవ్వాడ గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మొదట ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి, అనంతరం నాయకులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొదల గౌరీశంకర్, తాతాజీ, రమణ, అప్పారావు, అప్పలనాయుడు, సూరి దేముడు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 23 : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమర్‌ను పరిశ్రమల శాఖా మంత్రి అనడం కంటే కోడి గుడ్డు మంత్రి అంటేనే ప్రజలకు బాగా తెలుస్తుందన్నారు. జగన్‌ను పొగడటం, చంద్రబాబు, లోకేశ్‌ను తిట్టడమే ఆయన పని అని విమర్శించారు.

వలంటీర్లకు సన్మానం

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 23 : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అన్నారు.శుక్రవారం కొవ్వాడ గ్రామంలో ఆయన ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ముఖ్యమంత్రి జగన్ వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు.

ఓటు హక్కుపై చైతన్యానికి కళాజాత

సాగర్‌నగర్, ఫిబ్రవరి 23 : ఓటు హక్కుపై ప్రజలను చైతన్యపరచడానికి రాష్ట్రవ్యాప్తంగా సిటిజన్ ఫర్ డెమోక్రసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కళాజాత మొదటి కార్యక్రమాన్ని ఈనెల 25న గీతం వర్సిటీలో ప్రారంభించనున్నట్టు ఆ సంస్థ సంయుక్త కార్యదర్శి వి. లక్ష్మణరెడ్డి తెలిపారు. 12 మంది కళాకారుల బృందం వీధి నాటిక ప్రదర్శనతో పాటు ఓటు హక్కుపై చైతన్యపరిచే విధంగా నృత్యాలు, పాటలు, గజల్స్ గానం చేస్తారని చెప్పారు.

ప్రసన్న జ్యోతికి ఏయూ డాక్టరేట్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 23 : దేనిపాటి ప్రసన్నకు ఏయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. శుక్రవారం వీసీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఆమెకు డాక్టరేట్ పత్రాన్ని అందజేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.ఎం.యుగంధర్ మార్గదర్శకత్వంలో 'స్టడీస్ ఆన్ సెల్యూలాస్ ప్రొడెక్షన్ బై బ్యాక్టరీయా యసైన్డ్ ఇన్సిలికో అండ్ స్టాటిస్టికల్ అనాలిసిస్' అన్న అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ ఇచ్చారు.

ఒకే వేదికపై గంటా, ముత్తంశెట్టి

ఆనందపురం, ఫిబ్రవరి 23 : పెద్దిపాలెం ఎంపీటీసీ సభ్యుడు మరుపిల్ల చిన్నయ్యపాత్రుడు కుమార్తె వివాహ వేడుకకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం హాజరయ్యారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఇద్దరూ కాసేపు పలు విషయాలపై చర్చించుకుని సరదాగా గడిపారు.

సినిమా గైడ్

- **భ్రమయుగం :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శారద, శరత్, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ముఖ్య గమనిక :** వెంకటేశ్వర
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 21, టమాటా 18, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 42, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 48, బీరకాయలు 50, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 22, క్యారెట్ 22, దొండకాయలు 38, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 105, బరబటి 30, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 215, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

భీమిలిలో అక్రమార్కుల బరితెగింపు

- జీవీఎంసీ పేరుతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి మరీ కల్వర్టు నిర్మాణం
- గతంలోనే హెచ్చరించిన అధికారులు
- అయినా యథేచ్ఛగా పనులు



గెడ్డ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు, జరుగుతున్న కల్వర్టు పనులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 : భీమిలి బీచ్‌రోడ్డులో వున్న పెదచాకిరేవు గెడ్డ వద్ద అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. బడాబాబుల కనుసన్నల్లో జరుగుతున్న ఈ పనులకు జీవీఎంసీ పేరుతో నకిలీ బోర్డు ఒకటి పెట్టారు. అధికారులకు తెలియకుండానే ఈ బోర్డు అక్కడ వెలిసింది. ఇటీవల సముద్ర తీరాన్ని కూడా వదలకుండా కెరటాల ఒడ్డు వరకూ ఒక బడా నాయకుడు ప్రహరీ నిర్మిస్తున్న విషయాన్ని పత్రికలు వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అలాగే పెద చాకిరేవు కబ్జా జరుగుతున్న విషయాన్ని కూడా రెండు వారాల క్రితం పత్రికలు వెలుగులోకి తీసుకువచ్చాయి. దీనిపై స్పందించిన అధికారులు బడాబాబులకు సముద్ర కెరటాల వరకూ జిరాయితీ స్థలాలు వున్నాయని, పూర్వం నుంచీ వున్న చాకిరేవు గెడ్డ కూడా జిరాయితీ స్థలంలోనే వుందని చెప్పారు. గెడ్డకు రెండు వైపులా జిరాయితీ స్థలం వుండడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధిత యజమానులు అనుమతి కోరారని పట్టణ ప్రణాళికా అధికారులు తెలిపారు. ఆ స్థలం, గెడ్డ స్థలాలు పక్కపక్కనే వున్నాయి. దీంతో జీవీఎంసీ భీమిలి జోనల్ ఇంజనీరింగ్ అధికారులకు తెలియకుండానే అక్కడ బోర్డు ఏర్పాటు చేసి, దానిపై వర్క్ ఇన్ ప్రోగ్రెస్‌కల్వర్టు వర్క్‌గా పేర్కొంటూ రాశారు.

ఈ విషయమై జోనల్ ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా అక్కడ జీవీఎంసీ ఏవిధమైన కల్వర్టు పనులు చేయడం లేదని, తమకు వాటితో సంబంధం లేదని తెలిపారు. శనివారం ఆ బోర్డును, పనులను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

మసీద్‌కు రెండుసార్లు శంకుస్థాపన

- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఫిబ్రవరి 23 : ఆరిలోవ ఆఖరి బస్టాపు సమీపంలోని మసీద్ అదనపు భవన నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం రెండుసార్లు శంకుస్థాపన చేయడం సిగ్గుచేటని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మసీద్ అదనపు భవన నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో (2017) నిధులు కేటాయించి, శంకుస్థాపన చేశామని చెప్పారు. వైసీపీ మళ్లీ అవే పనులకు ఇటీవల శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉంద న్నారు. తమ ప్రభుత్వమే మసీద్ అదనపు భవన నిర్మాణానికి నిధులు కేటాయించినట్టు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చెప్పడం సరికాదన్నారు. ఎవరు ఏది మాట్లాడినా ఆమోదయోగ్యంగా ఉండాలని, ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వకూడదని సూచించారు. సమావేశంలో 13వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాత్రకుండద ధర్మారావు, ప్రధాన కార్యదర్శి యల్లమల్లి సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జి బాలస్వామి, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, యూనిట్ ఇన్‌చార్జి వడిసెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అప్పటి ఉత్తర్వుల కాపీలను చూపిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి



విజయానందపురంలో స్థానికులతో మాట్లాడుతున్న సందీప్

వైసీపీ పాలనతో వ్యవస్థలు నాశనం

- జనసేన భీమిలి అసెంబ్లీ ఇన్‌ఛార్జి సందీప్

పద్మనాభం, ఫిబ్రవరి 23 : వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతన్న వైసీపీని సాగనంపినప్పుడే ప్రజల కష్టాలు తీరుతాయని జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ అన్నారు. శుక్రవారం ఆయన నేరేళ్లవలస, విజయానందపురం, తునివలస, నర్సాపురం, రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల్లో పల్లె యాత్ర నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ ద్వారా వైసీపీ నాయకులు పేదల భూములను దోచేశారన్నారు. వారి అరాచకాల నుంచి విముక్తి పొందాలంటే ప్రజలు టీడీపీ-జనసేన కూటమికి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందీశ్వరావు, సూర్యనారాయణ, రామస్వామినాయుడు, సురేష్, సారధి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ రోడ్డుకు మోక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సింహాచలం, ఫిబ్రవరి 23 : జీవీఎంసీ 98వ వార్డులోని అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన రహదారిని కలుపుతూ నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఏడాది క్రితం శంకుస్థాపన చేసిన ఈ పనులపై 'రోడ్డు నిర్మాణం హామీ ఏమైంది' అన్న శీర్షికన ఈనెల 8న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. ఈమేరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభించి, శరవేగంగా చేపడుతున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు ఎమ్మెల్యే గణబాబు పూజలు



తొలిపావంచా వద్ద కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే గణబాబు

సింహాచలం, ఫిబ్రవరి 23 : పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సింహగిరికి కాలినడకన మెట్ల మార్గంలో తోడపెద్దు, గరిడీ బృందాలతో సహా వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఏటా బంధుమిత్రులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, గరిడీలతో తన నివాసం నుంచి పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈమేరకు శుక్రవారం గోపాలపట్నం నుంచి కాలినడకన బయలుదేరిన ఎమ్మెల్యేకు 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు సారథ్యంలో కార్యకర్తలు పైడితల్లెమ్మ ఆలయ వద్ద ఆహ్వానం పలికారు. అమ్మవారి దర్శనం తరువాత అందరితో కలిసి కాలినడకన సింహగిరికి చేరుకున్నారు. అప్పటికే ఆలయానికి చేరుకున్న కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఎన్నికల తరువాత ఎంపీ భూ ఆక్రమణలపై విచారణ

ఆరిలోవ, ఫిబ్రవరి 23 : వచ్చే ఎన్నికల తరువాత ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భూ ఆక్రమణలపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగన్ మురారి అన్నారు. శుక్రవారం ఆయన తోటగరువు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసారి ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. వెలగపూడికి ధీటుగా పోటీ చేసే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని, తూర్పులో పోటీ చేస్తున్న ఎంవీవీ ఓటమి కావడం ఖాయమన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం

భీమునిపట్నం, ఫిబ్రవరి 23 : మాఘ పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ హవనం ఘనంగా జరిగింది. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు లక్ష్మీనారాయణుల శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణంలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కేఎస్ఎన్ మూర్తి, కేవీ భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వుశిరికల బంగార్రాజు, ప్రసాదవర్మ, ఆలయ ప్రధానార్చకుడు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు రేపు

భీమునిపట్నం, ఫిబ్రవరి 23 : జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని ఈనెల 25న ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు ఆదర్శ హిందీ ప్రేమి మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 28న జరిగే సైన్స్ డేలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు 8985647419, 8985897419 సెల్ నంబర్లను సంప్రతించాలన్నారు.

కృష్ణాపురంలో మెగా రక్తదాన శిబిరం రేపు

పద్మనాభం, ఫిబ్రవరి 23 : మండలంలోని కృష్ణాపురంలో ఈనెల 25న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఎంపీపీ రాంబాబు, ఎస్సై సురేష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఇండియన్ బ్లడ్ బ్రదర్స్, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థలు మిషన్ తలసేమియా కిడ్స్ కోసం ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

నూకాలమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 23 : భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ఏప్రిల్ 7 నుంచి 10 వరకూ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిడుతూరి డెక్కన్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పీరుపల్లి రాజు, కోశాధికారి రాకోతు నరసింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగిరెడ్డి వెంకటస్వామి,కోఆర్డినేటర్ అప్పికొండ బాలకృష్ణ, పట్టణ ప్రముఖులు అల్లిపిల్లి నరసింగరావు, కంటుభుక్త ముత్యాలరావు, వాసుపల్లి కొండబాబు, ముక్కి కృష్ణ, పాసి మధుసూదనరావు పాల్గొన్నారు.

సింహగిరిపై త్రుటిలో తప్పిన ప్రమాదం

సింహాచలం, ఫిబ్రవరి 23 : సింహగిరిపై శుక్రవారం ఉదయం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి కిరాణా సరకులు తీసుకువచ్చిన గూడ్స్ వ్యాన్‌ను డ్రైవర్ పీఆర్‌ఓ ఆఫీసు సమీపంలో ఎత్తుకు ఎక్కించే క్రమంలో నియంత్రణ కోల్పోవడంతో వ్యాన్ వెనక్కి జారిపోయింది. దీంతో వ్యాన్ అక్కడి సమీపంలోని అంబులెన్స్‌ను తొలుత ఢీకొట్టగా దాని ముందు భాగం దెబ్బతింది. అలాగే మరి కాస్తా కిందకి జారడంతో పీఆర్‌ఓ ఆఫీసు ముందు పార్కింగ్ చేసి ఉన్న భక్తుల రెండు కార్లను ఢీకొంది. కారులోని ప్రయాణికులు వెంటనే కిందకు దిగిపోవడంతో వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. రెండు కార్లు కొంతమేరకు దెబ్బతిన్నాయి.

సంగివలస ఎన్‌ఆర్‌ఐలో గ్రాడ్యుయేషన్ డే

తగరపువలస, ఫిబ్రవరి 23 : సంగివలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. 2018-19లో మెడికల్ కోర్సు చేసిన విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ సుధాకర్, ప్రముఖ నెఫ్రాలజీ వైద్యుడు జి. రవిరాజు, డా. రాధ, మెడికల్ సూపరింటెండెంట్ డా. కృష్ణమూర్తిశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీధర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డా. శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య కృష్ణమోహన్‌కు జాతీయ పురస్కారం



కృష్ణమోహన్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 23 : ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి. కృష్ణమోహన్‌కి జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది.హిందుస్థాన్ టైమ్స్ నిర్వహించిన కార్యక్రమంలో 2023 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా 10 మంది ఆచార్యులను ఎంపిక చేసి, ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో కృష్ణమోహన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

సింహవల్లీ తాయార్‌కు వెండి వాకిలి బహూకరణ



వెండి వాకిలిని అధికారులకు ఇస్తున్న దాత

సింహాచలం, ఫిబ్రవరి 23 : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవేరుల్లో ఒకరైన బేడా మండపంలోని సింహవల్లీ తాయార్ సన్నిధికి మరింత శోభ చేకూర్చేందుకు నగరానికి చెందిన దాత పువ్వాడ శేష మస్తాన్‌రావు దంపతులు శుక్రవారం వెండి వాకిలిని బహూకరించారు. దాత అందజేసిన వివరాలు ప్రకారం సుమారు 28 కిలోల వెండితో అమ్మవారి ఆలయ ద్వారాలను రూ.20 లక్షలు వెచ్చించి రజితం చేయించారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలను అందజేశారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన



బూత్ కమిటీ కన్వీనర్లకు కిట్లు అందిస్తున్న రమణ

పద్మనాభం,ఫిబ్రవరి 23 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పేదల సంక్షేమమే ధ్యేయంగా రూపకల్పన చేసిన సూపర్ సిక్స్ పథకాలపై బూత్ కమిటీ కన్వీనర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ చెప్పారు. పద్మనాభంలో 45 పోలింగ్ బూత్ కన్వీనర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి వివక్ష లేకుండా కుటుంబంలో ఉన్న వారందరికీ ఆరు పథకాల గురించి వివరించాలన్నారు. ఆ వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాల కార్డుల కిట్‌లను బూత్ కన్వీనర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామోదరరావు, నందీశ్వరరావు, నగేష్‌కుమార్, గంగరాజు, సత్యనారాయణ, గణేష్, ఎర్నాయుడు, శ్రీను, పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పద్మావతి



మధురవాడ, ఫిబ్రవరి 23 : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) ఉపాక్షురాలిగా చంద్ర పద్మావతి నియామితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పద్మావతిని రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఆమె చినగదిలి మండలం పీఎంపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఆమె ఎన్నిక పట్ల ఆ సంఘం జిల్లా నాయకులు ఇమంది పైడిరాజు, పి. రాజేంద్రప్రసాద్ వర్మ, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పీవీ సర్కారు జయంతి

ఆరిలోవ, ఫిబ్రవరి 23 : మ్యాజిక్ షో వల్ల విద్యార్థులు మానసికంగా ఆనందం పొందుతారని విశాఖ వేలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్ అన్నారు. ప్రముఖ మేజిషియన్ పీవీ సర్కారు జయంతి బాల వికాష్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం విశాక వేలీ స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పీవీ సర్కార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పీవీ సర్కారు శిష్యుడు అన్వర్ భాషా చేసిన మ్యాజిక్ షో విద్యార్థులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు కృషి



పార్టీలో చేరిన వారితో వంశీకృష్ణ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23 : శివాజీపాలెంలోని జనసేన కార్యాలయంలో 23వ వార్డుకు చెందిన యువత జనసేన అర్బన్ అధ్యక్షుడు వంశీకృష్ణ యాదవ్ సమక్షంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో వికాస్‌రెడ్డి, మురళీమోహన్, హరి, వెంకటేష్, దడ్డ రఘు, సునీల్, శ్రీధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమృత ఆహారం పంటపై శిక్షణ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23 : సింహాచలం గోశాలలో ఈనెల 25 నుంచి అమృత ఆహారం పంటపై శిక్షణ ఇస్తామని గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన శివాజీపాలెంలోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం 10 నుంచి కూరగాయల మొక్కలకు అంట్లు కట్టడంపై శిక్షణ ఇస్తామన్నారు. ఇంటి మిద్దెపై కాయగూరలు పండించుకోవడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మిద్దె మీద పంటలు పండించుకోవాలనుకునే వారు 9866138129 నంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధి రాజు, అశోక్‌కుమార్, సాయిబాబా, పోదీశ్వర్, జేవీ రత్నం ఉన్నారు.

కృష్ణ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాట్లాడుతున్న ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ హరినాథ్

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23 : విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన, సేవాభావం, క్రమశిక్షణ ఉండాలని, ఎన్‌ఎస్‌ఎస్ ముఖ్య ఉద్దేశం అదేనని ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎస్. హరినాథ్ అన్నారు. శుక్రవారం ఆయన వీఎస్ కృష్ణడిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలను శుభ్రంగా ఉంచడం, ప్రజలను సమాజం పట్ల చైతన్యపరచడంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల కృషి వెలకట్టలేనిదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ సమాజ సేవను తమ సేవగా భావించే భావజాలం విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి పోల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక రెల్లివీధిని దత్తత తీసుకుని వారం రోజులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు జీవీ ప్రతాప్, బి. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్షయపై విద్యార్థులకు అవగాహన

మధురవాడ, ఫిబ్రవరి 23 : సకాలంలో గుర్తిస్తే క్షయ పూర్తిగా నయమవుతుందని వాంబేకాలనీ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మిత అన్నారు. క్షయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాంబేకాలనీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గీతాదేవి, మధురవాడ టీబీ యూనిట్ సిబ్బంది వీరబ్రహ్మం, సురేష్, కృష్ణ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు తులసీ దళార్చన

సింహాచలం, ఫిబ్రవరి 23 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం సహ స్రనామ తులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచారు. పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. నృసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో పూజలు చేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

వెంకన్న సన్నిధిలో విశేష హోమాలు

సింహాచలం, ఫిబ్రవరి 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయం కొండదిగువ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం విశేష హోమాలు జరిపారు. ఈనెల 19న అంకురార్పణతో ఏకా కుం డాత్మక పంచాహ్నిక దీక్షా యుత వార్షిక తిరుకల్యాణోత్సవాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈమేరకు వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. అనంతరం ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. మూర్తి మంత్రంతో, మూల మంత్రంతో, ద్వారతోరణ హోమం,పాలికా హోమం వంటి హోమాలను పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆలయ అర్చకులు రఘు, భార్గవ్ జరిపారు.

ఓపెన్ జిమ్‌లు ప్రారంభం

కొమ్మాది, ఫిబ్రవరి 23 : జీవీఎంసీ 6వ వార్డులోని రామాలయం దరి సన్‌షైన్ పార్కు, వేపచెట్టు పార్కు, షుగర్ ఫ్యాక్టరీ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. అలాగే సంపత్‌నగర్‌లో రూ. 18 లక్షలతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక, వైసీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, బొట్టా అప్పలరాజు, పోతిన ఎల్లాజీ, సంజీవ్, సియ్యాద్రి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు తనిఖీ

పద్మనాభం, ఫిబ్రవరి 23 : పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. నిబంధనల మేరకు 40 అడుగుల నిడివిగల రోడ్డులో వేసిన వెట్ మిక్సర్, బీటీ తదితరాలను తనిఖీ చేసి వాటి సాంపిళ్లు సేకరించారు. వాటిని లేబొరేటరీలో పరీక్షించి రోడ్డు నాణ్యత మేరకు ఇప్పటివరకు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లిస్తారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఎస్‌ఈ భాస్కర్, ఈఈ నాయర్, డీఈఈ భాస్కరరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ లలిత, తదితరులు పాల్గొన్నారు.